ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 24 జూలై 2025



అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- కార్మికుల ఆవాసంగా మారిన నిర్మాణాలు
- కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా

8

\- పెద్దపల్లి టౌన్



వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ప్రతిపక్ష పార్టీలపై నజర్

- బలాబలాలపై ఆరా తీస్తున్న ఇంటెలిజెన్స్
- పార్టీల్లో చేరికలపై దృష్టి
- స్థానిక ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చే వారిపై ఆరా!



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలపై నజర్ వేసింది. వారి కదలికలపై ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఆయా పార్టీల్లో ఎవరెవరు చేరుతున్నారనే విషయమై సమాచారం సేకరిస్తున్నారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అధికార పార్టీకి భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల నుంచి గట్టిగా పోటీనిచ్చే నాయకులు ఎవరు ఉన్నారనే విషయమై కూడా ఆరా తీస్తున్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన మేరకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ముందుగా ఈ నెలాఖరులోగా రిజర్వేషన్లను ఖరారు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గత ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో, మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం గత ఏడాది జూలై మాసంలో, మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది జనవరిలో ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత ఏడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో కులగణన సర్వే చేపట్టింది. ఆ సర్వేలో బీసీలే అధికంగా ఉన్నారని తేలింది. కుల గణన సర్వేకు ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం పొందింది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లులను ఆమోదించారు. ఆ బిల్లులను ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపించారు. అయితే ఈ బిల్లులు ఇప్పట్లో ఆమోదం పొందే అవకాశాలు లేకపోవడంతో 15 రోజుల క్రితం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఆర్డినెన్స్ తీసుకరావాలని నిర్ణయించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. ప్రస్తుతం ఆయన పరిశీలనలో ఉంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినా, కల్పించక పోయినా తప్పనిసరిగా సెప్టెంబర్‌లోగా ఎన్నికలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● స్థానిక ఎన్నికలను పకడ్బందీగా ఎదుర్కోవాలి

రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, మెజారిటీ స్థానాల్లో తామే గెలుస్తామనే ధీమాతో కాకుండా పకడ్బందీగా స్థానిక ఎన్నికలను ఎదుర్కోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ భావిస్తున్నారు. ఏ ఎన్నికను కూడా తక్కువ అంచనా వేయకుండా సీరియస్‌గానే పార్టీ క్యాడర్‌ను అప్రమత్తం చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో మంథనికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, రామగుండంకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 267 గ్రామ పంచాయతీలు, 13 రూరల్ మండలాల్లో

(మిగతా 8వపేజీలో)

● పార్టీల బలాబలాలపై ఆరా..

రిజర్వేషన్ల పరిస్థితి ఎలా ఉన్నా, స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల బలా బలాలు ఎలా ఉన్నాయనే విషయమై అధికార కాంగ్రెస్ పార్టీ ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా ఆరా తీస్తున్నది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారా, అసంతృప్తిగా ఉన్నారా అనే విషయమై కూడా తెలుసుకుంటున్నారు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన అభ్యర్థులే మెజారిటీ స్థానాల్లో గెలుపొందుతారు. కానీ ఈ ఎన్నికల నిర్వహణ ఆలస్యం అవుతుండడంతో పార్టీ పట్ల ప్రజల్లో ఏమైనా వ్యతిరేకత ఉందా, లేదా అని కూడా ఆరా తీస్తున్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలో తొమ్మిదన్నరేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీల గ్రాఫ్ ఎలా ఉందనే విషయమై ఆరా తీస్తున్నారు. గ్రామాల్లో ఏ పార్టీలకు చెందిన అభ్యర్థులు బలంగా ఉన్నారు. వారికి ప్రజల్లో బలం ఉంది, వాళ్ల అదే పార్టీలో ఉంటారా, పార్టీ మారే ఆలోచన ఉందా, పార్టీ మారకుంటే అదే పార్టీ నుంచి పోటీ చేస్తే, అధికార పార్టీ నుంచి ఎవరిని నిలబెట్టాలనే అంశాలపై కూడా ఆరా తీస్తున్నారు.

కలెక్టరేట్ వద్ద కంప్యూటర్ ఆపరేటర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఈ- పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వేతనాలు తగ్గించడంపై తెలంగాణ ఈ-పంచాయతీ కంప్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో 39 మంది ఆపరేటర్లు 2015 పనిచేస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి తమకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఇస్తున్నారని తెలిపారు. అంతకు ముందు నెలకు 22,750 రూపాయల వేతనం ఇవ్వగా, జనవరి నుంచి 19,500 రూపాయలు ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. వేతనాలు తగ్గించడం వల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుంచి మూడు మాసాల వేతనాలు కూగా ఇవ్వలేదన్నారు. ఈ నెల 24న తమ సమస్యలను పంచాయతీరాజ్ కమిషనర్ విన్నవించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి త్రిరి శ్రీరామ్, ఉపాధ్యక్షులు జి సతీష్‌కుమార్, ఏ సరిత, కోశాధికారి ఎండీ షౌకత్ అలీ పాల్గొన్నారు.

ఐటీఐలలో రెండవ దశ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఐటీఐ శిక్షణ కేంద్రాల్లో రెండవ దశ ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పెద్దపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 31 వరకు గడువు ఉందని, రూ.100 ఫీజులతో 8వ తరగతి పూర్తి చేసిన, 14 ఏళ్ల లోపు వారు అర్హులని, దరఖాస్తు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ నెంబర్, మొబైల్, మెయిల్ ఐడీ ఇవ్వాలని తెలిపారు. వివరాలకు ఫోన్. 8500463969 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రామగుండం కమిషనరేట్‌లో హెల్ప్‌లైన్

కోల్‌సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో సహాయ చర్యల కొరకు రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్లు ఫోన్. 9392483959, 9603666444 సంప్రదించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం కార్పొరేషన్ కమిషనర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహాలక్ష్మి పథకం దేశంలోనే చారిత్రాత్మకం

● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



ఆర్‌టీసీ మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం దేశంలో చారిత్రాత్మకంగా నిలిచిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.200కోట్ల మహిళలు ఉచిత ప్రయాణం చేసినందుకు బుధవారం గోదావరిఖని బస్టాండ్‌లో డిపో మేనేజర్ ఎం నాగభూషణం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పథకం ద్వారా మహిళల గౌరవాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేసిందని, సమాజంలో సమాన హక్కులకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం ద్వారా వారికి ఆర్థిక భారం కూడా తగ్గించడం జరిగిందని, రూ.6,680కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేశారని, ఇది కేవలం ప్రయాణం మాత్రమే కాకుండా మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేదిగా మారిందన్నారు. రవాణా వ్యవస్థను మెరుగుపర్చడం జరిగిందన్నారు. స్వశక్తి సంఘాల ద్వారా మహిళలకు ఆర్‌టీసీలో బస్సులను కూడా ఇవ్వడం జరిగిందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలకు ఇండ్లు, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు పెద్దపీట వేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో రామగుండం నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో పరుగున పెట్టిస్తున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం ఆర్‌టీసీలో అత్యుత్తమ సేవలందించిన మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, ముస్తాఫా, కొలిపాక సుజాత, బొమ్మక రాజేష్, గంగ శ్రీనివాస్, కళ్యాణి సింహచలంతో పాటు ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి చేయాలి

● కలెక్టర్ కోయ శ్రీహర్ష



పేరపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో కలెక్టర్



క్రీడాకారుడికి ఆర్చరీ కిట్ అందిస్తున్న కలెక్టర్

కమాన్ పూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని రొంపికుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, జడ్పీహెచ్ఎస్, మండల పరిషత్ పాఠశాల, పేరపల్లి గ్రామంలో ఎంపీపీఎస్, పీహెచ్‌సీ సబ్‌సెంటర్, కమాన్‌పూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జడ్పీ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం, భవితకేంద్రం, ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సంర్భంగా ఆయన మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ప్రయోగశాల, గ్రంథాలయాలను ప్రారంభించారు. పేరపల్లి ప్రాథమిక పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రొంపికుంట గ్రామంలో 208 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కాగా, 55 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, 153 ఇండ్లు పెండింగ్ ఉన్నాయని, శ్రావణ మాసంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ రవి సింగ్, ఎంపీడీఓ లలిత, మండల పంచాయతీ అధికారి మారుతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు తోడ్పాటు : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్చరీ క్రీడాకారుడు తానిపర్తి యశ్వంత్‌కు రూ.4,30,800 విలువ గల ఆర్చరీ కాంపౌండ్ బోను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్చరీ కోసం యశ్వంత్ దరఖాస్తు చేసుకోగా అందించినట్లు తెలిపారు.జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి సురేష్ కుమార్ ఉన్నారు.

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

\- 53.7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు
\- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం, ఇంకా 32 శాతం లోటు
\- శ్రీపాద ఎల్లంపల్లిలోకి 3,275 క్యూసెక్కుల వరద నీరు

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న వర్షాలతో వాగులు పొరుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు సాధారణ వర్షపాతం 11.3 మిల్లీ మీటర్లకు, 53.7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారి. అత్యధికంగా ధర్మారం మండలంలో 79.5 మిల్లీ మీటర్ల వర్షం కురి సింది. ఇప్పటి వరకు జిల్లాలో 361.2 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికి 246.4 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఇకా 32 శాతం లోటు వర్షపాతం ఉంది. కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగతా మండలాల్లో సాధారణానికంటే తక్కువగా లోటు వర్షపాతం ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లిలోకి వస్తున్న వరద నీరు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.928 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువ ప్రాంతం నుంచి 3,275 క్యూసె క్కుల వరద నీరు వస్తుండగా, 452 క్యూసెక్కుల నీటిని ఎన్టీపీసీకి,తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు.



ఖనిలోని లక్ష్మీనగర్‌లో గుంతలో దిగబడిన కారు



ఓదెలలో నీట మునిగిన వరి



పెగడపల్లిలో ఇంటిలోని నీటిని ఎత్తిపోస్తున్న మహిళ

● చెరువును మరిపిస్తున్న పొలాలు

ఓదెల : మండలంలో మంగళ, బుధవారం విస్తారంగా కుసురుస్తున్న ముసురు వర్షాలతో పొలాలన్నీ నీట మునిగి చెరువులను మరిపిస్తున్నాయి. ఓదెల, గుండ్లపల్లి, కనగర్తి, కొలనూర్, హరిపురం, నాంసానిపల్లి, లంబాడతండా తదితర గ్రామాల్లోని వరి పొలాలు వరద తాకిడికి గురయ్యాయి.

ఖనిలో 10సెంటీ మీటర్ల వర్షం

కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మంగళవారం, బుధవారం 10సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణంలోని ప్రధాన నాలాలు వర్షపు నీటితో నిండి ప్రవహించగా ఫైవింక్లయిన్, 2ఇంక్లైన్ మోరీల వద్ద వర్షపు నీటి ప్రవాహంతో రాకపోకలు నిలిచిపో యాయి. లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులు నడుస్తుండగా ఓ కారు గుంతలో దిగబడింది.

కాల్వశ్రీరాంపూర్: వర్షాలకు మండలంలోని పెగడపల్లిలో రెండో వార్డు జలమయంగా మారింది. ఇండ్లలోకి వర్షపు నీరు చేరి ఇంటిలోని బట్టలు, వస్తువులు తడిసిపోయాయి. మల్యాల నుంచి గుంపులకు వెళ్లే దారిలో నక్కల ఒర్రె పొంగి పొర్లుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

జూలపల్లి : మండలంలో విస్తారంగా కురిసిన వర్షానికి చెరువులు నిండిపోయాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పొలాలు నీటిలో మునిగిపోయాయి.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కనుకులలో ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్, జూలై 23: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని పద్నాలుగు గ్రామాలను కలుపుతున్న గర్రెపల్లి - పెగడపల్లి సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తామని, గ్రామీణ ప్రాంతాల ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కనుకుల రామునిపల్లి గ్రామాలలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఒక కోటి 36 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలకు, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కనుకుల రైతు వేదికలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ మేలు జరగలేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు తదితరులను కనుకులకు చెందిన సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ డైరక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్ గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పన్నాల రాములు, పోలు అంజయ్య, మీస సత్యనారాయణ, రాంరెడ్డి, చుక్క మొగిలి, చిలుక సతీష్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీలో చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి


మృతి చెందిన సయ్యద్ రిజ్వాన్, సర్వర్

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీలో బుధవారం చేపల వేటకువెళ్లి ఇద్దరు మృతిచెందారు. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సాలేనగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్(55) తన తమ్ముడి కుమారుడైన సయ్యద్ రిజ్వాన్(20)తోపాటు మహమ్మద్ ఇసాక్ (33) మండలంలోని లోయర్‌మానేర్ డ్యాం(ఎల్‌ఎండీ)లో చేపలవేటకు ఉదయం10గంటలకు వెళ్లారు. చేపలుపట్టే సమయంలో సయ్యద్ రిజ్వాన్(20) ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన రిజ్వాన్ పెద్దనాన్న సయ్యద్ సర్వర్(55) కాపాడేందుకు పోయి అతడితోపాటు నీటిలో మునిగి పోయాడు. అక్కడే ఉన్న మరోవ్యక్తి ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సమాచారం తెలుసుకున్న తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, నీటిమునిగిన వారి కుటుంబ సభ్యులు వెంటనే సంఘటన స్థలానికిచేరుకొని వలల సహాయంతో నీటిలో మునినిగిపోయిన ఇద్దరిని వెలికితీశారు. అప్పటికేఇద్దరు మృతిచెందారు. మృతదేహాలను కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్ట్

- పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
- కొనుగోలు చేసిన వారిపై కేసు

తంగళ్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులగా వరుసగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న దొంగలను తంగళ్లపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో దొంగల అరెస్ట్ చూపిన అనంతరం రూరల్ సీఐ మొగిలి మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఆడెపు రవి కుమార్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్నాడన్నారు. బుధవారం చోరీకి పాల్పడిన ఆడెపు రవికుమార్‌తోపాటు బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరోవ్యక్తి పరారయ్యాడని పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులు ఏడు నెలలుగా తంగళ్లపల్లి మండలంతో పాటు, ముస్తాబాద్, సిరిసిల్ల, వేములవాడ, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో పది ద్విచక్ర వాహనాలు చోరీ చేశారని, దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలను చందుర్తి, కరీంనగర్, సిరిసిల్లలో తక్కువ ధరకు విక్రయించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేసి పది వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దర్యాప్తు వేగవంతంగా చేసి చాకచక్యంగా దొంగలను పట్టుకున్న తంగళ్లపల్లి ఎస్ఐ ఉపేంద్రచారిని, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్, బాలనర్సయ్యలతోపాటు కానిస్టేబుళ్లు నరేందర్, రామ్మోహన్, వికాస్‌లను సీఐ అభినందించారు.


దొంగను, స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ మొగిలి

నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- 106 నకిలీ సర్టిఫికెట్లు.. కంప్యూటర్.. ప్రింటర్ స్వాధీనం

కోరుట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అదర్శనగర్ ప్రాంతానికి చెందినవ్యక్తి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్టు కోరుట్ల సీఐ సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్లలోని ఆదర్శనగర్‌కు చెందిన రుద్ర వేణుగోపాల్ పట్టణంలోని పోచమ్మ వీధిలో ఆన్‌లైన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఫొటోషాప్‌ద్వారా నకిలీ సర్టిఫికెట్లు, ఎస్సెసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెమోలు, నకిలీడెత్ సర్టిఫికెట్లు తయారు చేసి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీసీఎస్ పోలీసులతో పాటు స్థానికపోలీసులు ఆన్‌లైన్ కేంద్రంపై దాడి చేసినట్లు సీఐ తెలిపారు. అన్‌లైన్ కేంద్రంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కేంద్రంలో నిల్వఉన్న 106 నకిలీ సర్టిఫికెట్లు(పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, డెత్ సర్టిఫికెట్లను) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్, ప్రింటర్, పేపర్ కటింగ్, లామినేషన్ మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. రుద్ర వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల సీఐ సురేష్ బాబు, కోరుట్ల ఎస్ఐ చిరంజీవి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజు, సీసీఎస్ కానిస్టేబుల్స్‌ను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.



గ్రామీణ మహిళలకు వరం.. నమో డ్రోన్ దీదీ

- డిజిటల్ వ్యవసాయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకం
- మహిళ సంఘాలకు ఉపాధి అవకాశం

చొప్పదండి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యవసాయంలో భాగంగా గ్రామీణ మహిళల ఉపాధి కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని తీసుకువచ్చింది. వ్యవసాయ ఆధారిత ఉపాధేమార్గంగా మహిళలు జీవితాల్లో మార్పు తేవడంతో పాటు ఆధునిక సాంకేతికతను రైతులకు చేరవేడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈపథకాన్ని తీసుకువచ్చింది. మహిళా సాధికారిత, వ్యవసాయంలో ఆధునికత, నైపుణ్య అభివృద్ధితోపాటు గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి డ్రోన్ దీదీ నూతన అవకాశాలను కల్పిస్తున్నది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండగా ఆసక్తిఉన్న మహిళా సంఘాలు దరఖాస్తు చేసుకోవాలి.

● డ్రోన్ సేవలు..

సబ్సిడీపై అందే డ్రోన్లతో ఎస్‌హెచ్‌సీ గ్రూపులు వ్యవసాయంలో రైతులకు సహాయకారిగా పనిచేస్తాయి. ప్రతియేటా కనీసం లక్ష రూపాయల ఆదాయాన్ని పొందుతాయి. పంట పొలాలపై ఎరువులు, పురుగు మందుల పిచికారితోపాటు పంట సర్వేలు, మ్యాపింగ్, డేటా అనాలసిస్ లాంటి పనులను డ్రోన్‌ద్వారా సంఘాల సభ్యులు నిర్వహిస్తారు. వ్యవసాయాధారిత డ్రోన్‌ద్వారా సంఘాలకు ఆదాయంతోపాటు మహిళల జీవితాల్లో మార్పును తీసుకువస్తాయి. ప్రస్తుతం పంట పొలాలకు ఎరువులు, పురుగుమందుల పిచికారి కోసం రైతులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఎకరానికి 300నుంచి 500రూపాయల వరకు డ్రోన్ ఆపరేటర్లు చార్జి చేస్తున్నారు. డ్రోన్ మహిళా సంఘాలకు ఆదాయం తెచ్చిపెట్టనుంది. స్వయం సహాయక గ్రూపులు నమోడ్రోన్ దీదీ కోసం వ్యవసాయ శాఖ లేదా కృషి విజ్ఞాన కేంద్రాలను సంప్రదించాల్సి ఉంటుంది. లేదా టీటీట్సీఱజుజీజీఱజట్ప.ఛీచి.జౌ౯.జీ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు.

● నమో డ్రోన్ దీదీ లాభాలు..



దేశవ్యాప్తంగా 15వేల మహిళాగ్రూపులకు డ్రోన్లను అందించనుంది. ప్రతిడ్రోన్ కొనుగోలుపై కేంద్రప్రభుత్వం 80శాతం సబ్సిడీని అందజేస్తుంది. గరిష్ఠంగా 8లక్షల వరకు డ్రోన్ కొనుగోలుపై సబ్సిడీ అందుతుంది. మిగతా డబ్బులను అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా 3శాతం వడ్డీపై రుణాన్ని అందజేస్తారు. పథకానికి ఎంపికైన సంఘ సభ్యులకు డ్రోన్ నడిపేందుకు సరైన శిక్షణ అందిస్తారు. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో డ్రోన్‌ను సంఘాలకు అందజేస్తారు. డ్రోన్ శిక్షణ కోర్సును డీజీసీఏ అంగీకరిస్తుంది. రైతులకు డ్రోన్‌ద్వారా సేవలందించేందుకు వ్యవసాయశాఖ మహిళాసంఘాలకు మద్దతునిస్తోంది. ఎంపవర్డ్, నాఫెడ్, ఇఫ్కోతోపాటు కస్టమ్ హైరింగ్ సెంటర్స్ (సీహెచ్‌సీ)ల భాగస్వామ్యంతో పనిచేస్తాయి. డ్రోన్ తయారీదారులు, శిక్షణసంస్థలు, వ్యవసాయశాఖ కూడా సంఘాలకు సహకారాన్ని అందిస్తాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి ● మరో నలుగురికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామంలోని టోల్‌గేట్ సమీపంలో రోడ్డుకు పక్కన ఆగిఉన్న లారీని వెనకనుంచి కారుఢీకొంది. ఈ సంఘటనలో ఒకరు మృతిచెందగా, కారుడ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన లంగరు లోకేష్ తన మిత్రుడైన మన్నె రాఘవ(22)ను తీసుకొని హైదరాబాద్‌లో ఓకారును అద్దెకు తీసుకొన్నారు. అతనికి పరిచయిస్తురాలైన స్నేహ, ఆమెతోపాటు ఆమె తల్లి దండ్రులైన రాజేష్,లక్ష్మితో కలిసి కరీంనగర్‌లోని గంగాధరకు బయలుదేరారు. లోకేష్ కారు నడుపుతుండగా అతని పక్క సీట్లో రాఘవ కూర్చున్నాడు. వారు ప్రయాణిస్తున్న కారు తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలోని టోల్ గేట్ సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చున్న మన్నె రాఘవతోపాటు వెనకాల కూర్చొన్న మొర్కురి స్నేహ, మొర్కురి రాజేష్, మొర్కురి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎల్‌ఎండీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అక్కడే ఉన్న టోల్‌గేట్ అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు పరీక్షించి మన్నె రాఘవ మృతి చెందినట్లు తెలిపారు. మిగతా వారిలో మొర్కురి స్నేహ, రాజేష్, లక్ష్మి తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, డ్రైవర్ లోకేష్‌కు స్వల్ప గాయలయ్యాయి. మృతిచెందిన మన్నే రాఘవ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ లోకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

కువైట్‌లో గుండెపోటుతో ఖాసింపేట వాసి మృతి


సాగర్(ఫైల్)

గన్నేరువరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట గ్రామానికిచెందిన బత్తుల సాగర్(42) బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్ళి అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. మూడేళ్లక్రితం జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ రెండు నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. మళ్లీ ఇటీవలే కువైట్‌కు తిరిగి వెళ్లాడు. శనివారం అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు సాగర్ స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. మృతుడికి భార్య సరవ్వ, కూతురు ఉండగా కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహం కోసం కుటుంబసభ్యులు, బంధువులు ఎదురుచూస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ కమాన్ వద్ద రోడ్డుపై పడిఉన్న వ్యక్తిని 108 అంబులెన్స్ సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా అదే రోజు అర్ధరాత్రి 11 గంటలకు మృతి చెందాడు. మృతుడు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యేముందు తనపేరు అక్తర్ మహ్మద్ పాషా, బృందావన్‌కాలనీగా చెప్పినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలు తెలియరావడంలేదని, గుర్తించిన వారువెంటనే ప్రభుత్వాస్పత్రిలోని అవుట్ పోస్ట్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

- మరో ఐదుగురికి జరిమానా

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఆరుగురు వ్యక్తులకు జరిమానా విధిస్తూ గోదావరిఖని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు తెలిపారు. మద్యం సేవించి 2వసారి పట్టుబడిన ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష, మరోఐదుగురికి రూ.10వేలజరిమానా విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్కల దాడిలో లేగ దూడపై మృతిచెందగా, మరో దూడ గాయపడింది. ఈ సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కటకం మల్లికార్జున్, కటకం వేణు అనే రైతులకు చెందిన లేగ దూడలపై పిచ్చికుక్కలు బుధవారం తెల్లవారుజామున దాడి చేయడంతో ఓ లేగ దూడ మృతి చెందగా, మరో లెగదూడ తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతోంది. దూడ మృతి చెందడంతో రైతుకు సుమారు రూ.16వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. గ్రామంలో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామశివారులో పేకాటఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్టు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. నాగంపేట గ్రామ సమీపాన పేకాట ఆడుతున్నట్టు ఆడిన సమాచారం మేరకు గాలించగా ముగ్గురు పేకాట ఆడుతూ కనిపించారని పేర్కొన్నారు. వారిని పట్టుకొని, వారి నుంచి రూ.11,500, 3బైకులు, 2 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

కోనరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి జరిమానా విధించారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికిచెందిన చకినాల నర్సవ్వ గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ మళ్లీ నాటుసారా విక్రయిస్తూ బైండవర్ నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఆమెను అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.25వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలరాంపూర్ గ్రామానికి చెందిన గూడ రవి హత్య కేసులో నిందితుడైన గూడ గంగాధర్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల9న భూ తగాదాలో గంగాధర్‌వరసకు సోదరుడైన రవిని పారతో విచక్షణారహితంగా కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. రవిని మెరుగైనచికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించారు. రవి భార్య రజిత ఫిర్యాదు మేరకు అత్యాయత్నం కేసు నమోదు చేశారు. గూడ రవి చికిత్సపొందుతూ ఈనెల 21న మరణించాడు. దీంతో రవిపై మెటపల్లి సీఐ అనిల్‌కుమార్ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తుచేశారు. నిందితుడుగూడ గంగాధర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

ముత్తారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో కాల్వశ్రీరాంపూర్‌మండలం ఇదిలాపూర్ గ్రామానికి చెందిన సదానందం అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గోదావరిఖని ఇన్‌చార్జి ఏసీపీ మల్లా రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ

- బంగారు అభరణాలు, వెండి, నగదు అపహరణ



పోరండ్లలో విచారిస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లి సంఘటన మండలంలోని పోరండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోరండ్ల గ్రామంలో తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలో దొంగతనం జరిగింది. చందనం సుగుణ తన భర్త గతనెల క్రితం మరణించగా ఇల్లు వదిలిపెట్టి పోరండ్ల గ్రామంలోనే మరోఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతిరోజు తన సొంత ఇంటికి వస్తూ పోతూ ఉన్నారు. రోజు లాగే బుధవారం కూడా ఇంటికి వెళ్లిన సుగుణ కుమారుడికి ఇంటితాళాలు పగలగొట్టి ఉండటం గమనించాడు. వెంటనే తల్లికి సమాచారం అందించగా లోనికి వెళ్లి చూడటంతో ఇంట్లో ఉన్న బీరువాలో వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువలో దాచిఉంచిన మూడుతులాల బంగారం, 20 తులాల వెండి, కొంతనగదు కనబడలేదు. అదేవిధంగా గ్రామంలోనే మామిడిపల్లితిరుపతి ఇంట్లో కూడా ఎవ్వరూలేని సమయంలో తాళాలు పగలగొట్టి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పక్కనేఉన్న మామిడిపల్లి అంజవ్వ ఇంటితాళాలు పగల గొట్టి రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, క్లూస్‌టీం పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రేకులపల్లిలో చోరీ..

బీర్‌పూర్: మండలంలోని రేకుపల్లి గ్రామానికి చెందిన సూరారపు గంగయ్య అనే వృద్ధుడి ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్య ఇంట్లో తెల్లవారుజామున మూడుగంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుకాల ఉన్న తలుపులను పగులగొట్టి ఇంట్లో ప్రవేశించారు. గంగయ్యభార్య మెడలోని ఆభరణాలు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా గంగయ్య ప్రతిఘటించడంతో దొంగలు వారు తెచ్చుకున్న పదునైన ఆయుధాలతో గంగయ్య తొడపై గాయపర్చారు. గంగయ్య భార్య దగ్గర ఉన్న తులం కుత్తికట్టు, ఒక గ్రాము ముక్కుపుడక, 40తులాల వెండికడియాలు, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని ఇంటి వెనకాల నుంచి పారిపోయారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తులు నల్లని దుస్తులు ధరించి బూట్లువేసుకొనిఉన్నారని గంగయ్య తెలిపాడు. సంఘటన వివరాలు తెలుసుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజు పోలీసు సిబ్బందితో పోలీస్ డాగ్‌స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

బండి సంజయ్‌పై పోస్టుపెట్టిన బీఆర్ఎస్ నాయకుడి విచారణ

- 35(3) బీఎన్ఎస్ కింద నోటీసు
- వేధింపులకు గురి చేస్తున్నారన్న హరీష్‌రెడ్డి

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కుటుంబ సభ్యులపై ట్విట్టర్‌లో దూషిస్తూ పోస్టుపెట్టిన కేసులో రామగుండం బీఆర్ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డికి బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు 35(3) బీఎన్ఎస్ కింద నోటీసు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. బండి సంజయ్‌ని ఉద్దేశించి ముఖ్యమంత్రి, బండి సంజయ్ ఇద్దరు ఉన్న ఫొటోను పోస్టు చేస్తూ కించపరిచే విధంగా పోస్టు పెట్టారని గోదావరిఖనికి చెందిన బీజేపీ నాయకుడు కోమళ్ల మహేష్ 2024అక్టోబర్ 24న గోదావరిఖని ఏసీపీకి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు బుధవారం నోటీసు జారీచేశారు. ఈసందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై కక్షపూరితంగా కేసులు నమోదు చేస్తున్నారని, సోషల్ మీడియా కేసులు నిలువవని తెలిసి కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తనపై ఇప్పటికే 10 కేసులు పెట్టారన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దోపిడీకి పాల్పడిన ఎనిమిదిమంది సభ్యులు గల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది స్మార్ట్ ఫోన్లు, లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి పాల్పడిన జగిత్యాలరూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన తరాల శ్రీకాంత్ అలియాస్ బండి శ్రీకాంత్, చెట్ల మహేశ్, జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన పాలకుర్తిరాజు, విద్యానగర్ కాలనీకి చెందిన ఉల్లెంగుల సతీష్, పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన బడుసు మురళీ, సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఏలేటి మోహన్ రెడ్డి, రేచపల్లి గ్రామానికి చెందిన అన్నారపు రఘు, బండి మధును పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికిచెందిన ఇందూరి శంకరయ్య ఈనెల22వ తేదీన మధ్యాహ్నం గ్రామంనుంచి జగిత్యాలకు సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని హనుమాన్ వాడలో గల బీరయ్యగుడి వద్దకు రాగానే అకస్మాత్తుగా బండి శ్రీకాంత్, పాలకుర్తి రాజు, చెట్ల మల్లేశం అను ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. శంకరయ్యను సమీపంలోని పాలకుర్తి రాజు ఇంట్లోకి బలవంతంగా లాక్కొని వెళ్లి, కొట్టి బెదిరించి అతని వద్ద ఉన్న తులం పావు బంగారం దోపిడీ చేశారు. బండి శ్రీకాంత్ అను వ్యక్తి భయభ్రాంతులకు గురిచేసి శంకరయ్య ఫోన్ ద్వారా ఒకలక్ష రూపాయలు ఫోన్‌పే చేయించుకున్నాడు. తర్వాత బండి శ్రీకాంత్, చెట్ల మల్లేశం సమాచారం ఇవ్వడంతో మరో ఇద్దరు వ్యక్తులు ఉల్లెంగుల సతీష్, బడుసు మురళి కలిసి టీఎస్02ఈక్యూ 3666 నంబరుగల కారులో బలవంతంగా శంకరయ్యను సారంగాపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కొట్టారు. శంకరయ్యను ఇంకా డబ్బులు కావాలని.. ఇవ్వకుంటే చంపుతామని కత్తితో బెదిరించారు. తరువాత బండి శ్రీకాంత్ సెల్‌ఫోన్ ద్వారా ఏలేటి మోహన్‌రెడ్డి అనేవ్యక్తికి సమాచారం అందించి అక్కడికి పిలిపించాడు. జరిగిన విషయం చెప్పి వచ్చిన డబ్బులు అందరం పంచుకుందామని తెలిపాడు. ఏలేటి మోహన్ రెడ్డి అనే వ్యక్తి అన్నారపు రఘు, బండి మధును పిలిచి విషయం చెప్పగా వారు కూడా ఒప్పుకుని తర్వాత టీఎస్18హెచ్1246 నంబరుగల ఒక ద్విచక్రవాహనంపై కల్లెడ గ్రామంలోని ఇంటికి శంకరయ్యను తీసుకెళ్లారు. ఇంకా డబ్బు, బంగారం కావాలని శంకరయ్యను బెదిరించారు. దీంతో శంకరయ్య భయానికి గురయి ఇంట్లో తన తల్లి మీద గల బంగారు పుస్తెలతాడు తీసుకుని నిందితులకు ఇవ్వడానికి ప్రయత్నించాడు. కాగా సదరు బంగారు పుస్తెల తాడును తీసుకోకుండా, అది అమ్మి డబ్బులు తేవాలని బెదిరింపులకు గురిచేశారు. కల్లెడ గ్రామం నుంచి జగిత్యాలకు నిందితులు శంకరయ్యను ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకుని తీసుకొని వచ్చారు. పట్టణంలోని క్లాక్‌టవర్ దగ్గర గల బాలాజీ జువెల్లర్స్ దుకాణంలో బంగారు పుస్తెల తాడును విక్రయించి డబ్బులు తీసుకుంటుండగా శంకరయ్యకు బావ అయిన తుమ్మనపల్లి రమేష్ అక్కడకు అకస్మాత్తుగా వచ్చి అడ్డుకున్నాడు. వెంటనే బావ తుమ్మనపల్లి రమేష్ సహకారంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శంకరయ్య ఫిర్యాదు చేశారు. జగిత్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 23వ తేదీన సంఘటనలో నిందితులైన ఎనిమిది మంది జగిత్యాల పట్టణంలో టీఎస్ 21 ఎఫ్ 0252 నంబరు గల కారులో కూర్చుని దోపిడీచేసిన డబ్బులు పంచుకుందామని మాట్లాడుకుంటుండగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు. దోపిడీదొంగల ముఠాను పట్టుకోవడంలో కృషిచేసిన డీఎస్పీ రఘుచందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, రూరల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, రూరల్ ఎస్ఐ సధాకర్, ఎస్ఐ కుమారస్వామి, మహిళా ఎస్ఐ సుప్రియ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి రివార్డును అందజేశారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన



దీపాలు వెలిగిస్తున్న ఈవో, భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాలింగార్చనను అర్చకులు ఘనం గా నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్క రించుకుని అర్చకులు ఉదయం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రా భిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ అద్దాల మంటపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఈవో రాధాబాయితోపాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

బడి బ్యాగులు భారం కావొద్దు

● గట్టుబూత్కుర్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి

గంగాధర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బడి బ్యాగులు భారం కావొద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండలం గట్టుబూత్కుర్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు పది కిలోలు ఉండటంతో ఎంఈవో ప్రభాకర్‌రావు ప్రత్యేక చొరవ చూపి మూడు కిలోలు ఉండేలా అందించడం అభినందనీయమన్నారు. ఈవిషయం తెలుసుకుని పాఠశాలలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. బడి బ్యాగు బరువు తగ్గించడంతో ఈ విషయాన్ని రాష్ట్ర ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలస్‌తో ఫోన్‌లో మాట్లాడి గంగాధర ఎంఈవో ప్రభాకర్ రావు పనితీరును వివరించారు. గంగాధర మండలం గట్టుబూత్కు ర్‌లో అనుసరిస్తున్న మూడుకిలోల విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బడిబ్యాగు మూడుకిలోలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్న ఎంఈవో ప్రభాకర్‌రావును ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



బ్యాగు బరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సబ్బితం జలపాతం

అభివృద్ధికి రూ.6 కోట్లు

● పర్యాటక ప్రాంతంగా మారనున్న గట్టు సింగారం



సబ్బితం జలపాతం(ఫైల్)

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు.. చిన్న పాటి చినుకులకే గట్టు సింగారం జలపాతం జల ధారలతో సవ్వడి చేస్తుంది. జాలువారే జలపాత ధారల కింద తడిసి ముద్దవ్వాలని ఎవరికైనా అనిపిస్తుంది. ఈ జలపాతం పర్యాటకులను వర్షాకాలంలోనే కనువిందు చేస్తుంటుంది. జిల్లా వాసులే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి ఇక్కడికి పర్యాటకులు ప్రతి ఏటా వస్తుంటారు. ఇక్కడ సరైన వసతులు లేక, రక్షణ చర్యలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సబ్బితం జలపాతాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమ ణారావు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన గెలుపొందిన తర్వాత అధికారులతో కలిసి జలపాతాన్ని సందర్శించారు. ఆ మేరకు సంబంధిత అధికారులు 12 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రతిపాదనలు ఎమ్మెల్యే ప్రభుత్వానికి సమర్పించారు. ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ టూరిజం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ఎందరో ప్రజా ప్రతినిధులు సబ్బితం జలపాతాన్ని సందర్శించి దానిని అభివృద్ధి చేస్తామని చెప్పినా నెరవేర్చలేదన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. సబ్బితం జలపాతం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

● ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు
● రూ. 2.54 కోట్లతో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ సామగ్రి పంపిణీ
● గ్రామైక్య సంఘాలకు లబ్ది



పంపిణీకి సిద్ధంగా ఉన్న స్టీల్ బ్యాంకులు

పర్యావరణ పరిరక్షణకు స్టీల్ బ్యాంకులు

సైదాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు స్టీల్‌బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2.54 కోట్ల రూపాయల వ్యయంతో స్టీల్ సామగ్రిని మహిళా సంఘాలకు పంపిణీ చేస్తున్నారు. ఈనెల 17న హుస్నాబాద్ నియోజక వర్గంలోని కోహెడ మండలంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతల మీదుగా స్టీల్ బ్యాంకుల కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. 19న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి సైదాపూర్ మండలంలోని ఆరు గ్రామైక్య సంఘాలకు స్టీల్ బ్యాంకులను అందజేశారు. మిగత సంఘాలకు త్వరలోనే అందజేస్తామన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామైక్య సంఘాలకు వీటిని అప్పగిస్తున్నారు.

● మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు

స్టీల్ బ్యాంక్‌ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పచెబుతున్నారు. వారు నామమాత్రం రుసుముతో గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించే వారి కి సామగ్రి అందించనున్నారు. ప్రతీ గ్రామైక్య సంఘా నికి ఒక స్టీల్ బ్యాంకు మంత్రి పంపిణీ చేస్తున్నారు. స్టీల్ బ్యాంకులో టిఫిన్ లంచ్ ప్లేట్లు, బౌల్స్, వాటర్, టీ గ్లాసులు, డిష్‌లు, బకెట్లు, చేసిన్లు, జ గ్గులు, చెంచాలతో పాటు వంట సామాగ్రి గిన్నెలు ఉంటాయి. ఫంక్షన్‌కు ఉపయోగపడే అన్ని వస్తువులను ఈ స్టీల్ బ్యాంకులో ఉంచారు. స్టీల్ బ్యాంకుల పంపిణీతో సైదాపూర్ మండలంలో 35 గ్రామైక్య సంఘాలకు లబ్ధి చేకూర నుంది. ఈ స్టీల్ బ్యాంకులు కిరాయికి ఇచ్చి ఆ వచ్చిన ఆదాయంతో సంఘాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు.



సైదాపూర్‌లో మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

● హోటళ్లకు స్టీల్ గ్లాసుల అందజేత

ఇప్పటికే మంత్రి నియోజక వర్గంలో హోటల్ యజమానులకు స్టీల్ టీ గ్లాసులను పంపిణీ చేశారు. ఇక నుంచి హోటళ్లలో పేపర్ గ్లాసులు గాని, ప్లాస్టిక్ గ్లాసులు గానీ వడవద్దని, స్టీల్ గ్లాసుల్లో టీ ఇవ్వాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరుతున్నారు.

ఆలయాల్లో శ్రావణమాసం ఉత్సవాలు నిర్వహించాలి

● సహాయ కమిషనర్ నాయిని సుప్రియ

కరీంనగర్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భం గా శుక్రవారం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ఆలయాల్లో శ్రావణమా సోత్సవాలు నిర్వహించాలని దేవాదాయ శాఖ సహాయకమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. అస్సెస్సబుల్, డీడీఎన్ ఆలయాల నిర్వహణ సమయం కంటే అరగంట ముందే తెరవాలని సూచించారు. ప్రత్యేక రోజుల్లో ఆలయాల స్థితిని బట్టి ప్రసాద వితరణ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వనమహోత్స వంలో భాగంగా పెద్దపల్లి జగిత్యాల జిల్లా లకు ఇచ్చిన లక్ష్యం పూర్తయ్యిందని, కరీం నగర్‌లో కొన్ని ఆలయాల్లో మొక్కలు నాటా మని పేర్కొన్నారు. మిగతా ఆలయాల్లో మొక్కలు నాటేందుకు ఆర్థిక స్తోమత, సిబ్బంది లేనందున మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు మొక్కలు నాటే విషయంలో లేఖలు రాశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వ్యాపారిని బెదిరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని వ్యాపారులకు ఫోన్లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిం పులకు పాల్పడిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీ సులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. లక్ష్మీనగర్‌లో పని చేసే ఒక హమాలీ కార్మికుడు ఫోన్లు చేసి రూ.10 లక్షలు ఇవ్వాలంటూ బెదిరిం చినట్టు పోలీ సులు గుర్తించారు. అతన్ని విచారించినట్టు తెలుస్తోంది.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

రుద్రంగి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపైన బుధ వారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలకేంద్రానికి చెందిన సిర్రం వెంకటి (50) మంగళవారం జగిత్యాల జిల్లాలోని తమ బంధువుల ఇంటికి ఓ యువకుడితో కలిసి బైక్‌పైవెళ్లి తిరిగి రాత్రి రుద్రంగికి వచ్చారు. అయితే బుధవారం ఉదయం రుద్రంగి శివారులోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని నందివాగు వద్ద వెంకటి మృతదేహంపడి ఉండటాన్ని గమ నించిన స్థానికులు పోలీసులకు సమాచా రం అందించారు. వెంకటిమృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో సీఐ వేంకటేశ్వర్లు వారితో మాట్లాడిసర్ది చెప్ప డంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి కూమారుడు మహేం దర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలి పారు. మృతుడికి భార్య కొమురవ్వ, ఇద్దరు కూమారులు, కూతురు ఉన్నారు.

ఇళ్లపై తెగిపడిన విద్యుత్ తీగలు

● తప్పిన పెను ప్రమాదం

గొల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్రావుపేటలో బుధ వారం భారీవర్షానికి ఎల్టీ విద్యుత్‌తీగలు తెగిఇళ్లపైపడ్డాయి. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో కాలనీవాసులతోపాటు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఎడతెరిపి వర్షం ధాటికి ఎల్టీ విద్యుత్‌తీగలు తెగి ఇళ్లపైపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై ఇళ్ లోంచి బయటికి పరుగులుతీసి ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారంఅందించారు. సిబ్బం ది సకాలంలో స్పందించి విద్యుత్‌సరఫరాను నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ట్రాన్స్‌కోసిబ్బంది విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి సరఫరాను పున రుద్ధరించారు. ఇళ్ల పైనుంచి ఎల్టీవిద్యుత్ తీగలతో ప్రమాదం పొంచిఉందని, లైన్‌ను తొలగించాలని గ్రామస్థులు కోరారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.1.10కోట్లు

మల్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,10,03,402నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 53 రోజులకు గాను ఆలయంలోని 12 హుండీలను విప్పి బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 61 విదేశి కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో లభించిన మిశ్రమ బంగారం, వెండిని సీల్‌చేసి హుండీలలోనే వేసినట్లు తెలి పారు. స్థానాచార్యులు కపీందర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్, అధికారులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పోలీసులు పాల్గొన్నారు. హుండీ కౌంటింగ్ పర్యవేక్షణకు ఏసీ కార్యాలయం నుంచి రాజమోగిలి హాజరయ్యారు.

● తలనీలాల టెండర్ రద్దు..

కొండగట్టులో గురువారం నిర్వహించ తలపెట్టిన తలనీలాల టెండర్ రద్దు చేసినట్లు ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సేకరించి నిల్వ చేసిన తలనీలాలకు దేవస్థానం అధికారులు ఈ నెల 18న టెండర్లకు ఏర్పాట్లు చేయగా 13 కాంట్రాక్ట్ సంస్థలు హాజరయ్యాయి. అయితే అధికారులు 24కు వాయిదా వేశారు. తాజాగా గురువారం నాటి టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్ ప్రకటన జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



దబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

● అంజన్నను దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సతీసమేతంగా బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన విప్‌కు దేవస్థానం అధికారులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విప్ దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఆలయ అధికారులు, నాయకులు విప్ వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ సబ్ జూని యర్ బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బాక్సిం గ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాదం మహేందర్, గువ్వ శ్రీని వాస్ ఒక ప్రకటనలో తెలి పారు. ఈనెల 25, 26, 27వతేదీల్లో షేక్‌పేట్ మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లె క్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో ఎంపిక పోటీలు జరిగాయ న్నారు. జిల్లాకు చెందిన దుగ్యాల రాఘవ్‌రావు, పాదం హర్షిత్‌పటేల్, స్వరాలి, మోక్షత, విద్యాధిప్, సాయి, అక్షయ్ వర్ధన్, రిశ్వంత్, శశాంక్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు సాగర్, అరుణ్, మహిపాల్, నరేష్, కోచ్‌లు వంశీ కృష్ణ, నవీన్ అభినందించారు.



బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జగిత్యాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ధర్మపురి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ (బాలికల) విద్యార్థి ముస్కువిశాల్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపిక య్యాడు. స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విశాల్ తెలంగాణ అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో 16సంవత్స రాల విభాగంలో 600మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించాడు. ఆగస్టు3న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి విశాల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కొలిచాల శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అటుకుల స్వప్న, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థి విశాలుకు హెచ్‌ఎం శ్రీనివాస్ షైక్ షూ అందించారు.



పోటీలకు ఎంపికైన విశాల్

ఎమర్జెన్సీ పోరాటయోధులకు త్వరలోనే తీపి కబురు

● భారత్ సురక్షాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే తీపికబురు అందించనుందని భారత సురక్షాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్ తెలిపారు. భారత్ సురక్షా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎమర్జె న్సీకి వ్యతిరేకంగా పోరాడిన సత్యాగ్రహులను స్వాతం త్ర్య సమరయోధులుగా కేంద్రప్రభుత్వం త్వరలో పెన్షన్ విధానం అమలుచేస్తుందని అన్నా రు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తు లను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేం దుకు భారత ప్రభుత్వం కేబినేట్‌లో తీర్మానం చేసిందని, త్వరలోనే స్వాతంత్ర్య సమరయోధులను ఏ విధంగా గుర్తిస్తున్నా రో అదే విధంగా ఎమర్జెన్సీ యోధులను కూడా గుర్తిస్తారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు అశోక్ రెడ్డి, సత్యప్రకాష్, దర్శన్, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్‌తో పాటు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాసంఘ బాధ్యులు రాష్ట్ర నాయకత్వాన్ని ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

ఆధ్యాత్మిక భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు

● 10జిల్లాలకు చెందిన 1000మంది కళాకారులు.. 10 గంటల ప్రదర్శన



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతితో బుధవారం ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్, కళారవళి సోషియోకల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక భజన ప్రదర్శనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 1000 మంది కళాకారులు 10 గంటలపాటు నిర్విరామంగా భజన చేసి రికార్డు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ ఇండియా ప్రతినిధి బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ వేణుకుమార్ రికార్డులో పేరు నమోదైనట్లు ప్రకటించి ధృవ పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కళాకారులకు రికార్డు ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్ ఫౌండర్ సల్వాజి ప్రవీణ్, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుదాసు గోపాల్ రావు, రఘుకుల తిలక పాట సృష్టికర్త కొండల స్వామి, బోగ శ్రీనివాస్, రవీందర్, జీఎల్ నామ్‌దేవ్, ఏపీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.76 లక్షల విలువైన గుట్కా పట్టివేత

● 13.17 లక్షల నగదు సీజ్
● పోలీసుల అదుపులో 11 మంది



పోలీసులు సీజ్ చేసిన గుట్కాలోడ్ వ్యాన్

కరీంనగర్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఒక ముఠా కరీంనగర్, గోదావరి ఖని ప్రాంతాలకు మహారాష్ట్రలోని బీదర్ నుంచి నిషేధిత గుట్కాను తరలి స్తోంది. గుట్టుచప్పుడు కాకుండా స్థానికంగా వ్యాపారులకు సర ఫరా చేస్తోంది. దీనిపై నిఘాపెట్టిన కరీంనగర్ టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు రూ.76లక్షల విలువైనగుట్కాతోపాటు 11మందిని పకడ్బందీగా పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ బిల్లకోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ తీగల వంతెనవద్ద పోలీసులు బుధవారం ఉదయం గూడ్స్‌వ్యాన్, మినీ ట్రక్‌లను సోదాచేశారు. మహారాష్ట్రలోని బీదర్ నుంచి కరీంనగర్‌కు రవాణా అవుతున్న నిషేధిత గుట్కాను, ముఠాను పట్టుకున్నారు. ముఠాకు చెందిన వారిలో గోదావరిఖనికి చెందిన నలుగురు, కరీంనగర్‌కు చెందిన ఏడుగు రిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈకేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. రెండు వాహనాలతోపాటు 304 బ్యాగ్‌లలో ఉన్న 7,60,000 గుట్కా పాకెట్లను సీజ్ చేశారు. నిందితుల వద్ద నుంచి 13,17,850 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. 13 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు


సుల్తానాబాద్‌లో పనులు పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్, జూలై 23: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దాంతో మున్సిపల్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. పలు కాలనీల్లో నీటి ప్రవాహం చేరింది. అయితే వెంటనే మున్సిపల్ సిబ్బంది అధికారులు రంగ ప్రవేశం చేసి లోతట్టు ప్రాంతాలలో చేరిన నీటిని యంత్రాల ద్వారా మళ్లించారు. కమిషనర్ తిప్పరాజు రమేష్‌తో పాటు సిబ్బంది పలు ప్రాంతాలను సందర్శించి మరో మూడు రోజులు కూడా భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వర్లు


కోటేశ్వర్లుకు నియామక పత్రం అందజేస్తున్న మంత్రి వివేక్

గోదావరిఖని, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన రాచకొండ కోటేశ్వర్లును నియమిస్తూ బుధవారం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి నియామక పత్రాలను అందజేయగా, ఈ పత్రాలను కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి వివేక్ చేతుల మీదుగా రాచకొండ కోటేశ్వర్లు అందుకున్నారు. తన నియామకం కోసం కృషి చేసిన మంత్రి వివేక్, ఎంపీ గడ్డం వంశీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామికి కోటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు భూమాల చందర్, కాంగ్రెస్ నాయకులు దుబాసి మల్లేష్, నర్సింగ్ దొర, బోయిని మహేష్, మధు, కిశోర్, జావిద్ అభినందించారు.

రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ రాజకీయం

-మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడి

పెద్దపల్లిటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి ఆరోపించారు. పెద్దకల్వలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పయ్యావుల శ్రీనివాస్, మానుక శ్రీనివాసుతో పాటు పలువురు ఆ పార్టీలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కర్రె సంజీవ్‌రెడ్డి పల్లె సదానందం, పర్శ శంకర్, ఒడ్నాల లక్ష్మయ్య, నాంసాని తిరుపతి, పయ్యావుల సమ్మయ్య, నాంసాని రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

పెద్దపల్లి రూరల్ , జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ లబ్దిదారుల ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, తాపీ మేస్త్రీలతో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష సమావేశాన్ని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్, ఎంపీవో ఫయాజ్, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో వ్యాపారాలను అభివృద్ధి చేసి చూపిస్తా


లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని వ్యాపార కేంద్రాలను అభివృద్ధి చేయడం ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసి చూపెడుతానని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తా నుంచి వ్యాపార కేంద్రాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. మెయిన్ చౌరస్తాలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను జాప్యం చేయవద్దని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతాల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పలువురు వ్యాపార కేంద్రాల అభివృద్ధిపై కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

మంథనిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామంలో విద్యుత్ వైర్లు తగిలి పర్శ బాపుకు చెందిన మేక బుధవారం మృతి చెందింది. పొలం వద్ద విద్యుత్ తెగి మేకపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది.

మందకృష్ణ సన్మాన సభను విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య

గోదావరిఖని, జూలై 23(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం మంద కృష్ణమాదిగ ఎనలేని కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 40ఏళ్లుగా మంద కృష్ణమాదిగ పోరాటం చేశారని, కేంద్ర ప్రభుత్వం కూడా మంద కృష్ణ సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డును ఇచ్చారని, ఎస్సీల కోసమే కాకుండా బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం మంద కృష్ణమాదిగ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ నెల 25న మొట్ట మొదటిసారిగా గోదావరిఖనికి వస్తున్న మంద కృష్ణమాదిగను గోదావరిఖని ఆర్‌కే గార్డెన్‌లో సన్మానించనున్నట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు తాళ్లపల్లి యుగంధర్, మంథని సంపత్ పాల్గొన్నారు.

యూరియా నిల్వల తనిఖీ

పాలకుర్తి,జులై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు పీఏసిఎస్ కన్నాల శ్రీరామ ట్రేడర్స్‌పాలకుర్తి వాసవి ఫెర్టిలేజర్,బసంత్‌నగర్ ఓం సాయి ఫెర్టిలేజర్స్‌శ్రీ ఆంజనేయ ఫెర్టిలేజర్స్ కుక్కలగూడూర్‌లో బుధవారం యూరియా నిల్వలను తనిఖీ చేశారు. కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఖనిలో ఘనంగా యజ్ఞ మహోత్సవాలు

కోల్‌సిటీటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం రాష్ట్రీయ సాధు సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు, రాజశ్యామల దేవి ఉపాసకుడు తూడి శ్రావణ్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో గోదావరిఖని సత్యసాయి మందిరం ప్రాంగణంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన మహాసుదర్శన, శ్రీరాజశ్యామలదేవి త్రయాహ్నిక యజ్ఞ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో త్రిశక్తిమాత స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు కోమళ్ళ మహేష్, అరవింద్‌స్వామి, మచ్చ విశ్వాస్, కుమారస్వామి, రవి, భవాని, అమ్మ రాజు భక్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ నాయకులను టార్గెట్ చేయడం, మతాలను కించపరిచే విధంగా పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ఖనిలో తిలక్ జయంతి

కళ్యాణ్‌నగర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య పోరాటంలో బాల గంగాధర్ తిలక్ కీలకపాత్ర పోషించారని వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ అన్నారు. బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా గోదావరిఖని తిలక్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

● కార్మికుల ఆవాసంగా మారిన నిర్మాణాలు ● కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా

పెద్దపల్లి టౌన్, జులై 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అన్ని రకాల మార్కెట్లు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వ్యవసాయ మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టింది. పనులు 90 శాతం పూర్తయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వం మారింది. మిగిలి ఉన్న పనులు నిలిచిపోవడంతో నిర్మాణాలు వృథా ఉన్నాయి. ఒడిస్సా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వలస కార్మికులకు అవాసంగా మారింది.

జెండా చౌరస్తాలో ఉన్న పాత కూరగాయల మార్కెట్ వర్షాకాలంలో మురుగు నీరు నిలిచి పందులు దోమలు స్వైర విహారం చేస్తూ దుర్వాసన వెదజల్లడంతో మటన్, చికెన్, కురగాయలు, ఫిష్ మార్కెట్ ఒకే చోట ఉండేలా వ్యవసాయ మార్కెట్ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. పనులు చివరి దశకు చేరగానే గత ప్రభుత్వం అధికారం కోల్పోయింది. దీంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ మార్కెట్ వద్ద ప్రజలకు అందుబాటులో ఉండదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాత వ్యవసాయ మార్కెట్‌లో ఉంటే ఊరి నడిబొడ్డున ఉండడంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు కూడా అనువుగా ఉంటుందని పాత మార్కెట్ స్థానంలో మార్కెట్ నిర్మించాలని నిర్ణయించారు. నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇక్కడ మార్కెట్ నిర్మించడం అనువుగా ఉంటుందని ప్రజలు, వ్యాపారులు పేర్కొంటున్నారు.


కార్మికులు ఏర్పాటు చేసుకున్న ఆవాసం

వ్యవసాయ మార్కెట్లో 4 కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిరుపయోగంగా ఉండి వలస కార్మికులకు అడ్డాగా మారింది. అక్కడే డేరాలు, బాత్రూంలు ఏర్పాటు చేసుకుని ఆవాసం ఉంటున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు వసతి గృహాలు అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. వ్యవసాయ మార్కెట్లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేసి ప్రభుత్వ కార్యాలయాలకు లేదా హాస్టళ్లకు కేటాయించాలనే డిమాండ్ వస్తున్నది. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక చొరవ చూపి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ ఇక్కడే ఉండాలి

అహ్మద్, మటన్‌షాపు నిర్వాహకుడు



పెద్దపల్లికి మెయిన్ సెంటర్ జెండా చౌరస్తా. అక్కడే కూరగాయల మార్కెట్ ఉంటే కాలినడకన వచ్చి వారికి కొనుక్కుంటారు. వ్యవసాయ మార్కెట్లో అనుకూలంగా ఉండదు.

ప్రతిపక్ష పార్టీలపై నజర్

(5వ పేజీ తరువాయి)

13 జడ్పీటీసీ స్థానాలు, 137 ఎంపీటీసీ స్థానాలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటన్నింటినీ కైవసం చేసుకోవాలని అధికారపార్టీ భావిస్తున్నది. అధికార పార్టీకి గట్టి పోటీ నిచ్చేందుకు టీఆర్ఎస్, బీజేపీలు సన్నద్ధం అవుతున్నాయి. ఇప్పటి వరకు ఆయా పార్టీల్లో చేరికలు ఇంకా మొదలు కాలేదు. కాంగ్రెస్ పార్టీలోకి పలు పార్టీల నాయకులు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రోత్సహించడం లేదు. తొమ్మిదిన్నరేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడానికి కృషిచేసిన నాయకులకు రిజర్వేషన్లను బట్టి టిక్కెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే అధికార పార్టీ ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా పరిస్థితులపై ఆరా తీస్తున్నది. మెజరిటీ స్థానాల గెలుపుపై అన్ని పార్టీల నాయకులు కార్యాచరణ ప్రారంభించారు.

క్రికెట్ క్రీడాకారిణికి చేయూత

జ్యోతినగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి క్రికెట్‌లో రాణిస్తున్న స్థానిక అన్నపూర్ణకాలనీకి చెందిన కుమ్మరి స్ఫూర్తి ప్రదాయినికి శ్రీ భగవతి యూత్ అసోసియేషన్ చేయూత నందించింది. స్ఫూర్తికి హైదరాబాద్‌లో క్రికెట్ కోచింగ్ అకాడమీలో మెరుగైన శిక్షణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు భగవతి యూత్ ముందుకు వచ్చింది. ఈ మేరకు బుధవారం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకటి రవిగౌడ్, మాచిడి మహేందర్‌గౌడ్ తదితరులు మొదటి విడతగా 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని స్ఫూర్తికి అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ముత్తారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్, ఎస్సై నరేష్‌తో చర్చించారు. ఆర్థికంగా వెనుకబడిన ఇందిరమ్మ లబ్ధిదారులను గుర్తించి, వారి ఇళ్ల నిర్మాణాలకు అయ్యే ఖర్చులు తగ్గించేలా తాపీమేస్త్రీలతో మాట్లాడదామన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

రామగిరి: మండల పరిషత్ భవనంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఎంపీడీవో శైలజారాణి, తహసీల్దార్ సుమన్, ఎంపీవోలు ఉమేష్‌లు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా ఎదురయ్యే సమస్యలు, ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, మట్టి, తక్కువ ధరకే ఇటుకలు ఇప్పించేలా చూడాలని అన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డులను వెంటనే పంపిణీ చేయాలని సూచనలు చేశారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోగం



మార్కెట్ కమిటీ చైర్మన్‌కు పూల బొకే ఇస్తున్న డీఎం నాగభూషణం


మంథనిలో మహిళలను సన్మానిస్తున్న అధికారులు

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల ప్రయాణ టికెట్లు ద్వారా మహిళలు ప్రయాణించిన సందర్భంగా బుధవారం పెద్దపల్లి బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ మహిళలకు, విద్యార్థినిలకు, చిరువ్యాపారులకు, స్వయం ఉపాధి పనులు చేసుకునే వారికి ఎంతో ఆదా అవుతున్నదని అన్నారు. మహాలక్ష్మి పథకం మహిళల ఆదరణ చూరగొన్నదని అన్నారు. గోదావరిఖని డిపో మేనేజర్ బి నాగభూషణం మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల టికెట్లు మహిళలు ఉపయోగించుకున్నారని, తద్వారా ఆర్టీసీకి 6,680 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని అన్నారు. ఈ పథకం వల్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి అడుగు పెడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో గోదావరిఖని డిపో అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, బస్టాండ్ స్టేషన్ మేనేజర్ కే రాంగోపాల్ రెడ్డి, కే రామయ్య, రమేష్, అనిల్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూతగడ్డ సంపత్, సుభాష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● మంథని: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం 18 నెలల్లో రూ. 200 కోట్లు దాటడం మరో మైలు రాయిగా నిలుస్తుందని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీజీ ఈఆర్సీ అడ్వయిజర్ శశిభూషణ్ కాచేలు అన్నారు. డీఎం శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంథని బస్టాండ్ ఏర్పాటులో బుధవారం ఏర్పాటు చేసిన సంబరాల్లో వారు మాట్లాడారు. ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్, మంథని సత్యం, ఏడీఎం ఏంజిల్, అధికారులు, మహిళలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం

పెద్దపల్లి కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ బుధవారం విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల ప్రీతం, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్నకొండ సాయిరాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మామిడిపల్లి అరవింద్, అర్నకొండ ఆదిత్య, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, మధుకర్, నితిన్, వినయ్, రాజు, అరవింద్, మనోహర్, నరేష్, శివతోపాటు పలువురు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ బుధవారం గోదావరిఖనిలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్ ఎఫ్ జిల్లా రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటూ సాగర్, గోడిశెల ప్రణీత్, అభినయ్, రాకేష్, ప్రకాష్, తరుణ్, యూసఫ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్న రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గు చేటని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు శివ శశివర్ధన్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజేష్, ధనుస్, ప్రణయ్ ఉన్నారు.

పాలకుర్తి: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన పాఠశాలల బంద్ పాలకుర్తిలో విజయవంతమైంది. పలు ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.

సంక్షిప్తంగా

పాలకుర్తి: మండల అభివృద్ధి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈ-పంచాయతీ, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కంప్యూటర్ ఆపరేటర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంపీడీవో కలికోట రామ్‌మోహనచారికి వినతి పత్రం అందించారు.

● జూలపల్లి: మండలంలో పనిచేస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను పరిస్కరించాలని కోరుతూ ఎంపిడిఓ పద్మజ, ఎంపిఓ అనిల్‌రెడ్డిలకువినతిపత్రం అందించారు.

● కమాన్‌పూర్: పంచాయతీ రాజ్‌శాఖలో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లకు రూ.22,750 వేతనం చెల్లించాలని ఎంపీడీఓకు బుధవారం ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.

● పెద్దపల్లిటౌన్ : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెండా చౌరస్తాలో గోవాలో జరిగే ఓబీసీ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

● సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని అతి ప్రాచీన ప్రసిద్ధమైన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళి తెలిపారు. బుధవారం ఆయన పరిసరాలను, ఆవరణ శుభ్రం చేయించారు.

● సుల్తానాబాద్ బీసీల కోసం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించడం కోసం చేసే పోరాటంలో భాగంగా ఆగష్టు 3వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జేఎన్టీయూలో నైపుణ్య శిక్షణ

రామగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. కళాశాలలో పనిచేసే అధ్యాపకులకు నైపుణ్యత పెంచడానికి ఎడ్యునెట్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఎడ్యునెట్‌కు చెందిన సాంకేతిక నిపుణులు ఐదు రోజుల పాటు కళాశాలలో పనిచేస్తున్న 18 మంది అధ్యాపకులకు సాంకేతిక, బోధన నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎడ్యునెట్ చెందిన సుమిత్, పవన్‌లు ఫిజికల్ మోడ్‌లో శిక్షణ అందించనున్నట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకుడిగా డాక్టర్ పుప్పాల తిరుపతి వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖనిలో ఘనంగా బోనాలు


పోతరాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం ముగింపు, శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం గోదావరిఖని పట్టణంలో ఘనంగా పోచమ్మ, మైసమ్మ బోనాలను నిర్వహించారు. 42వ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లో మహిళలు పోచమ్మ బోనాలతో గోదావరిఖని చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. పోతరాజు నృత్యాలు, డప్పు చప్పుళ్లతో పోచమ్మకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బంగి అనీల్ కుమార్, మాజీ కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, పొన్నం విద్యలక్ష్మణ్, గణముక్కుల మహాలక్ష్మి, తిరుపతి, ట్యాక్సీ స్టాండ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ : ఆషాఢ మాసం సందర్భంగా 42వ డివిజన్ మేదరి బస్తీ నుంచి గోటిక స్వప్న ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బోనం ఎత్తుకున్నారు.



ఆర్జీ-3, ఏపీఏలలో క్వార్టర్స్ కౌన్సెలింగ్


క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌లకు సంబంధించిన క్వార్టర్స్ కౌన్సెలింగ్‌ను బుధవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించారు. స్థానిక ఎస్అండ్‌పిసి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కౌన్సిలింగ్ సమావేశానికి ఉద్యోగులు హాజరయ్యారు. 164 ఖాళీ క్వార్టర్స్ ఉండగా అందులో ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్‌ఆఫ్ క్వార్టర్ల కొరకు 88 మంది ఉద్యోగులు ధరఖాస్తు చేసుకోగా 22 మంది ఉద్యోగులు హాజరయ్యారు. 12 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే కేటాయింపు పత్రాలను అందజేస్తామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎంఆర్‌సి రెడ్డి, బెల్లంశ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు నిర్వహించి కార్మికులను ఆదుకోవాలి


సింగరేణి సీఎండీతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని, జూలై 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ప్రతినిధి బృందం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాంను కోరారు. బుధవారం హైదరాబాదులోని సింగరేణిభవన్‌లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. గడిచిన సంవత్సరం కాలంగా మెడికల్ బోర్డులో హయ్యర్ సెంటర్‌కు రెఫరల్ కాబడిన రోగులను అన్‌ఫిట్ చేయకపోవడం, విధులకు అనుమతించకపోవడం వలన ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎండీకి వివరించారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించినట్టు టీబీజీకేఎస్ నాయకులు తెలిపారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, వైద్యశాలల్లో బీపీ, షుగర్‌తో పాటు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. సింగరేణి పరిశ్రమను కాపాడుకోవడానికి కొత్త బొగ్గు గనులు ప్రారంభించడానికి తక్షణమే కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ మనుగడకు, అభివృద్ధికి దోహదపడే పలు రంగాలపై దృష్టి పెడుతున్నట్లు సింగరేణి సీఎండీ వివరించారు. గత సంవత్సరం సింగరేణి సంస్థ సాధించిన లాభాలను ప్రకటించి వెంటనే వాటా చెల్లించాలని ప్రతిపాదించగా ఆయన గతం కంటే ఎక్కువ లాభాలే వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియనాయక్, పుట్ట మధు, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

రామగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లలో బుధవారం బీఎంఎస్ 70వ ఆవిర్భావ వేడుకలను బీఎంఎస్ బ్రాంచ్ సెక్రటరీ రౌతు రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్‌లలోని ఓసిపి-1,2, ఏఎల్‌పిలలో బిఎంఎస్ జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నమనేని వేణుగోపాల్, మర్రి సంతోష్, విద్యాసాగర్, జానీ పాషా, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ నాయకులు బుధవారం ఆర్జీ-2 ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఓసీపీ-3 కృషిభవన్, ఆర్జీ-2 ఏరియా ఆఫీస్‌లో బీఎంఎస్ జండాలను ఆవిష్కరించారు. యూనియన్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు చవ్వ మహేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ వై సారంగపాణి, ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.